కార్మికులను తొలగిస్తే ఆందోళన తప్పదు : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప రిమ్స్ జిజిహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులను తొలగిస్తే ఆందోళన నిర్వహిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఆప్కాస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, పవన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రిమ్స్ ఏర్పడినప్పటి నుంచి శానిటేషన్ కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని నిర్లక్ష్యంగా రావద్దని మౌఖికంగా ఆదేశాలు జారీ చేయడాన్ని ఖండించారు. 50 సంవత్సరాలు దాటిన వారిని తొలగిస్తామని పద్మావతి హాస్పిటలిటీ మేనేజ్మెంట్ సర్వీస్ యాజమాన్యం చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. పద్మావతి హాస్పిటల్ మేనేజ్మెంట్ సర్వీసును బ్లాక్ లిస్టులో పెట్టాలని తెలిపారు. వర్కర్లను తొలగిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా కార్మికులకు రూ.18,600 వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికులను వేధిస్తూ ఇబ్బందులు గురిచేస్తున్న పద్మావతి హాస్పిటల్ మేనేజ్మెంట్ సర్వీసు, కాంట్రాక్టర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు.

చర్చించేనా!

జిల్లా ప్రగతిపై సమగ్రంగా చర్చించడంపై సందేహం నెలకొంది. సుమారు ఏడాది కిందటి నుంచి వ్యవసాయ శాఖ నుంచి 12 ప్రధాన శాఖల చర్చను మధ్యాహ్నం రెండు గంటలకు పరిమితం చేయడం నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. శనివారం జడ్‌పి ఛైర్మన్ రామగోవిందరెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. రబీ సీజన్‌లో నెలకొన్న తుపాన్ ప్రభావ పరిస్థితుల్లో ముందుకు సాగని సాగు, కదలని ఉక్కు పరిశ్రమ పనులు, సిఎం హోదాలో చంద్రబాబు ఇచ్చిన జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులకు కేటాయింపులు, అరటి, చీనీ, బొప్పాయి, పత్తి ధరల పతనం వంటి కీలక సమస్యలపై లోతుగా చర్చించాల్సిన అవసరం ఉంది. జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్ విభాగాలకు వైద్య నిపుణులు, నర్సింగ్, టెక్నీషియన్స్ కొరతపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రబీ సమస్యలపై దృష్టి సారించాలి
కదలని ఉక్కు పరిశ్రమ పనులు
నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా రైతాంగం ధరల పతనం సమస్యతో సతమతమవుతోంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో తుపాన్ ప్రభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు ఊపందుకుంది. ఫలితంగా యూరియా, డిఎపి తదితర ఎరువులను అందుబాటులో ఉంచాల్సి ఉంది. రబీ సీజన్‌లో వరి, వేరుశనగ, బుడ్డశనగ, మొక్కజొన్న పత్తి పంటలు ప్రధానమైనవి. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా అన్నమయ్య జిల్లాలో మోస్తరు వర్షాలు, కడప జిల్లాలో సాధారణ పరిమాణంలో వర్షాలు కురుస్తున్నాయి. ఆయకట్టు, మెట్ట ప్రాంతాల్లో సాగు ఊపందుకుంది. జిల్లా రైతులు పండించిన పంటలైన పత్తి, మొక్కజొన్న ధరల పతనం ఆందోళన కలిగిస్తోంది. అరటి, బొప్పాయి, చీనీ, ఉల్లి ధరలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ధరల స్థిరీకరణ నిధిని ఉల్లి రైతులకు సహాయం అందిస్తామన్న హామీ ప్రకటనలకే పరిమితమైంది. కడప జిల్లాలో 3.26 లక్షలు, అన్నమయ్య జిల్లాలో 68,367 ఎకరాల్లో పంటల సాగు ఊపందుకుంది. ఖరీఫ్‌లోని వరి, ఉల్లి, ఉద్యాన పంటలైన అరటి, చీనీ, బొప్పాయి, పత్తి, మొక్కజొన్న దిగుబడులన్నీ ఒక్కసారిగా రావడంతో ధరల కొరత ఏర్పడింది. ప్రభుత్వమే ఉత్పాదనలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్కారుకు చెడ్డపేరు వస్తోందనే సంగతిని అధికారులు, రాజకీయ నాయకత్వం గుర్తించాల్సిన అవసరం ఉంది. తల్లికివందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తుండడం తెలిసిందే. జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ, సైకియాట్రిక్, కేన్సర్ విభాగాలకు వైద్యనిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఆధునిక పరికరాల ఆపరేటర్ల నియామకం చేపట్టడంలో వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ ఆశించిన ప్రయోజనం నెరవేర్చడం లేదనే విమర్శలు ఉన్నాయి. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, శ్రీనివాసపురం రిజర్వాయర్ పనుల ఎప్పుడు చేపడతారో తెలియని పరిస్థితి నెలకొంది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనుల్లో కదలిక, హంద్రీ-నీవా నుంచి కుప్పానికి తరించిన కృష్ణాజలాలు, శ్రీనివాసపురం రిజర్వాయరుకు ఎందుకు మళ్లించలేదో తెలియని పరిస్థితి నెలకొంది. కడప కార్పొరేషన్‌లోని దేవుని కడప రహదారి విస్తరణ పెండింగ్, నాలుగు స్ట్రోమ్ డ్రెయిన్ పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వాసితుల మొరను ఆలకించే నాధుడే కరువయ్యారు. సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల నత్తనడకను సమీక్షించాలి. యురేనియం వ్యర్థాల నిర్వహణలోని టెయిల్ పాండ్ పటిష్టతను సమీక్షించాల్సి ఉంది. యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియలేదు.

ఉక్కు పరిశ్రమ నిర్మాణం దేవతావస్త్రాన్ని తలపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అధికార, ప్రతిపక్షాలు పోటీలు పడి ఇచ్చిన హామీల్లో ఉక్కు పరిశ్రమ ప్రధానమైంది. ప్రాధాన్య హామీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతను తలపిస్తోంది. మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఉక్కు పరిశ్రమ సామర్థ్య పరిమాణం, ఉత్పాదన, ఉపాధిని తగ్గించి జెఎస్‌డబ్ల్యూ కంపెనీకి అప్పగించడం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన జడ్‌పిటిసి ఉపఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల్లో ఒకటైన ఒంటిమిట్టకు శ్రీరామా ఎత్తిపోతల పథకం పనుల పునరుద్ధరణకు నోచుకోలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమిటి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు ఆచరణలో జరుగుతున్నదేమిటనే చర్చ నడుస్తోంది. జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చాపాడులో దిత్వా తుపాన్ కారణంగా తడిసిన వరిధాన్యం

వెక్కిరిస్తున్న ఉక్కు స్థాపన శిలాఫలకం

ప్రణాళిక ప్రకారం ఇస్తేమా : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో రాష్ట్ర స్థాయిలో ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించే 'శుభే ఆంధ్రాకే ఖురానోకా దీనీ ఇస్తేమా' కార్యక్రమాన్ని ప్రణాళిక ప్రకారం ప్రశాంతంగా విజయవంతం చేయడానికి అన్ని రకాల ఏర్పాట్లను పక్కాగా చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులు, కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం ఆయన కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డితో కలిసి కొప్పర్తి పారిశ్రామిక వాడ సమీపంలో 350 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించనున్న ఇస్తేమా కార్యక్రమ నిర్వహణా ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నిర్వహణ ఏర్పాట్ల కోసం రూపొందించిన ప్రణాళిక మ్యాపును పరిశీలించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి అత్యంత ప్రాధాన్యతతో ఈసారి కడప జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్న ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. తాగునీరు, విద్యుత్, మెడికల్, ట్రాఫిక్, బందోబస్తు, ఫైర్ సేఫ్టీ, బ్యారికెట్స్ తదితర మౌలిక అంశాలపై జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యులు, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు తెలంగాణ, దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీ పెద్దలు హాజరు కానున్నారని చెప్పారు. కమలాపురం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీస్థాయిలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో ఎక్కడా ఏ చిన్నపాటి అవాంతరాలకు అవకాశం లేకుండా ఇస్తేమా కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, ఎపి ఐఐసి జెడ్‌ఎం శ్రీనివాస మూర్తి, డిపిఒ రాజ్యలక్ష్మి, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ రమణ, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ఏడుకొండలు, ఆర్ అండ్ బి ఎస్ఇ భాస్కర్ రెడ్డి, అధికారులు, కమిటీ కార్యవర్గ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న కలెక్టర్

వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- కడప అర్బన్

వర్షం, చలికాలాల్లో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని డిఎంహెచ్ఒ నాగరాజు పేర్కొన్నారు. ఫ్రైడే - డ్రై డే సందర్భంగా కడప నగరం 40వ డివిజన్‌లోని మరియాపురం, భవాని నగర్, మరాఠీ వీధిలో అక్కయ్య పల్లె అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ముఖ్యంగా సెక్ ట్రైపస్ దోమ వల్ల జబ్బులు వస్తాయని తెలిపారు. ఈ వ్యాధి ప్రమాదకరమైన వ్యాధి కాదని, ఈ వ్యాధి కొత్తది ఏమి కాదని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. జ్వరం వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించి వ్యాధికి సంబంధించిన మందులు వాడుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో శుభ్రమైన మంచి నీటిని తాగాలని, లేకపోతే వాంతులు, విరోచనాలు, పచ్చ కామెర్లు, టైఫాయిడ్ లాంటి వ్యాధులు రావడానికి ఎక్కువ అవకాశం ఉందని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల అంటువ్యాధులు రావడానికి అవకాశం ఉండదని పేర్కొన్నారు. జబ్బులు సోకిన వెంటనే అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అక్కయపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రోషన్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్ రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ మరియా, శాంతి, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, చెన్నమ్మ, ఆశ కార్యకర్తలు కుమారి, రాణి, ఉష బాయ్, లక్ష్మీనారాయణమ్మ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

ప్రజాశక్తి - కడప : ఈ ఏడాదిలో వైఎస్ఆర్ కడప జిల్లాలో కురిసిన అధిక వర్షాలు వలన నష్టపోయిన ఉద్యాన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్ పుట్ సబ్సిడీని విడుదల చేసినట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 14 మండ లాలలో 528. 94 హెక్టారలలో 718 ఉద్యాన రైతులకు నష్టం వాటిల్లిగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1.85 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ విడుదల చేసిందన్నారు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-కడప అర్బన్

నేషనల్ మెడికల్ కౌన్సిల్, డాక్టర్ ఎన్‌టిఆర్ యునివర్శిటీ ఆదేశాల మేరకు జిజిహెచ్ కళాశాలలో శుక్రవారం వైద్య విద్యార్థులకు వైద్య విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'ఎమోషనల్ అసెస్మెంట్ ఇన్ స్టూడెంట్స్ బైఎడ్యుకేటర్స్' అనే అంశం మీద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బెంగళూరు నుంచి డాక్టర్ నెల్సన్ వినోద్ మోసెస్ ప్రధాన వక్తగా పాల్గొని మెడికల్ చదివే యువత ఎక్కువ సమయం అకడెమిక్ ఒత్తిడిలో గడపడం వల్ల వారి భావోద్వేగ సహనశక్తి దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో వారు ఉపాధ్యాయులు, కుటుంబసభ్యులు లేదా నిపుణులతో పంచుకుంటే సమస్యల పరిష్కారం త్వరగా లభిస్తుందని సూచించారు. విద్యార్థులో సాధారణంగా కన్పించే ఒత్తిడి లక్షణాలు, ఎమోషనల్ అసెస్‌మెంట్ పద్ధతులు, ఆత్మహత్య ఆలోచనలు ముందుగానే గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. సమస్యలు ప్రతి ఒక్కరి జీవితంలో వస్తాయని, వాటిని దాచి పెట్టకుండా సరైన సమయంలో సాయం తీసుకుంటే ఏ పరిస్థితినైనా అధిగమించవచ్చని డాక్టర్ నెల్సన్ చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుభద్ర, చరిత, మేఘన, మొదటి సంవత్సరం విద్యార్థులు హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని జిల్లా పోలీస్ సంక్షేమ ఆస్పత్రిలో శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో హోమ్‌గార్డ్స్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎఆర్ ఎఎస్‌పి బి.రమణయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన వైద్యులు కృష్ణ చైతన్య (ఆర్థోపెడిక్ సర్జన్) సౌజన్య సందా(గైనకాలజిస్ట్) తమ వంతు సామాజిక బాధ్యతగా హోంగార్డ్ సిబ్బంది కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కంటి చూపు సమస్యలు వంటివి ముందుగానే గుర్తించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి నాగేశ్వర రావు, పోలీస్ యూనిట్ డాక్టర్ రేష్మ, ఆర్ఐలు శ్రీశైల రెడ్డి, టైటస్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-సింహాద్రిపురం : మండలంలోని బలపనూరులో రైతు నాగేశ్వర్ రెడ్డి(60) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలపారు. శుక్రవారం గ్రామ సమీపంలోని సెల్ టవర్ వద్దనున్న వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి ఐదు ఎకరాల మెట్ట పొలం ఉంది. నాలుగేళ్లుగా పొలంలో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడం, అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు సైతం రాకపోవడంతో తీవ్ర నష్టం వచ్చింది. మృతునికి భార్య లక్ష్మీదేవితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - బద్వేలు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడైనా నీరు నిల్వ వుండే పాత డ్రమ్ములు, పాత టైర్లు ఉంటే తక్షణమే తొలగించుకోవాలని తెలిపారు. పాత టైర్లు బయట వేయడం ద్వారా అందులో నీరు నిల్వ ఉండి దోమల లార్వా వృద్ధి చెంది డెంగ్యూ, చికెన్ గున్యా వంటి జబ్బులు వస్తాయని చెప్పారు. పాత టైర్‌లు ఎక్కడైనా ఉంటే తొలగించాలని తెలిపారు. అనంతరం కోటవీధిలో నూతనంగా నిర్మిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు కోటవీధి అర్బన్ సెంటర్ డాక్టర్ సౌమ్య , ఇన్‌ఛార్జి శానిటరి ఇన్‌స్పెక్టర్, హెల్త్ సెక్రెటరీలు, మున్సిపల్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

తలపడుతున్న రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్, సౌత్‌జోన్ విన్నర్స్ జట్లు

ప్రజాశక్తి - కడప

ఎసిఎ అండర్ - 14 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్,సౌత్ నార్త్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 55.2 ఓవర్లలో 111 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. నార్త్ జోన్ విన్నర్స్ జట్టులోని చాణిక్య సాయి 4, ధీరజ్ 3 వికెట్లు తీసుకున్నారు. నార్త్ జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 84.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఆ జట్టులోని శ్రీరామ్ 103 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. సాయి అర్జున్ 40 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని రతన్ 5, చరణ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 12.0 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్ విన్నర్స్ జట్టు ఆధిక్యత సాధించింది.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో రెస్టాపు సౌత్ జట్టు 77.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. ఆ జట్టులోని రిషి 69, తాహిర్ 56 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రెస్టాపు సెంట్రల్ జోన్ జట్టు 76.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. ఆ జట్టులోని రాజ్ 139 పరుగులు (సెంచరీ) చేశాడు. లిఖిత్ 50, చరణ్ 61 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జట్టులోని తాహిర్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు ఆదిక్యత సాధించింది.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్, సౌత్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ విన్నర్స్ జట్టు 22.5 ఓవర్లలో 91 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టులోని వీకేష్ 5 వికెట్లు తీసుకున్నాడు. సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 58.0 ఓవర్లలో 210 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని యాసీన్ సిద్ధిక్ 76, జై వర్ధన్ నాథ్ 48 పరుగులు చేశారు. సౌత్ జోన్ విన్నర్స్ జట్టులోని రక్షణ సాయి 3, తరుణ్ కుమార్ రెడ్డి 3, సంతోష్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ విన్నర్స్ జట్టు 28. 0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. ఆ జట్టులోని రక్షణ సాయి 75 నాట్ అవుట్, మణిదీప్ 36 పరుగులు చేశారు. సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టులోని రామ్ కిరణ్ విన్నీ 3, జై వర్ధన్ నాథ్ 3 వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు ఆధిక్యత సాధించింది.

బిఎస్ఎన్ఎల్‌కు కేంద్రం తీవ్ర అన్యాయం

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు అశోక్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌కు తీవ్ర అన్యాయం చేస్తుందని, 4జి, 5జి నెట్వర్క్ ఇవ్వాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు పి .అశోక్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం పాత రిమ్స్‌లో ఉన్న బిసి భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం, ఆల్ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ మనుగడను కేంద్ర ప్రభుత్వం ప్రశ్నార్థకంగా మార్చిందని విమర్శించారు. పే రివిజన్ పై సంతకాలు పెట్టిన ముందుకు తీసుకువెళ్లేందుకు యాజమాన్యం తీవ్ర జాప్యం చేస్తుందని తెలిపారు. పే రివిజన్ చేస్తేనే, పెన్షన్ రివిజన్ చేసేందుకు మార్గం సుగుమవుతుందని చెప్పారు. వీటిని సాధించాలంటే పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ ఉపాధ్యక్షులు రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి కృష్ణ బాలాజీ, ఎఐబిడిపిఎ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రామారావు, రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్, అధ్యక్షులు సాగర్, ఉపాధ్యక్షులు అక్బర్ బాషా, బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్ బాష, డీజీఎం బాలగంగాధర రెడ్డి, ఎస్ఎన్ఇఎ కార్యదర్శి రామానుజులు రెడ్డి, సేవా వెంకటరమణ, అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు కళ్యా సుధాకర్, బిఎస్ఎన్ఎల్ ఇయూ జిల్లా కార్యదర్శి ఆకుల సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు. **నూతన కార్యవర్గం ఎన్నిక..** ఎఐబి డిపిఎడిపిఎ జిల్లా అధ్యక్షులుగా ఎస్. వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కళ్యా సుధాకర్, కోశాధికారిగా వి.వెంకట రమణయ్య, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. **బిఎస్ఎన్ఎల్ ఇయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక..** జిల్లా అధ్యక్షులుగా కళ్యా సుధాకర్, కార్యదర్శిగా ఆకుల సుబ్బారావు, కోశాధికారిగా జె.యల్. పంతులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న అశోక్‌బాబు

దేశ ప్రయోజనాల కోసమే మన జ్ఞానం

ప్రజాశక్తి - కడప అర్బన్

మన దేశ పౌరుల జ్ఞానం దేశ ప్రయోజనాల కోసం వినియోగం అయితే దేశం అభివృద్ధి దిశగా వెళుతుందని పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ మేనేజ్మెంట్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ ఆర్. కాసిలింగం అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో 'క్రాస్-ఫంక్షనల్ మేనేజ్మెంట్ అనలిటిక్స్ ఫర్ బిజినెస్ సక్సెస్' అనే రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను కన్వీనర్, డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ పి. సరిత ఆధ్వర్యంలో అన్నమాచార్య సెనెట్ హాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కాశీ లింగం మాట్లాడుతూ ఇంతకాలం వ్యవసాయంపై ఆధారపడిన మనం ఇవాళ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పైన ఆధారపడుతున్నామని తెలిపారు. మన దేశ శాస్త్రవేత్తలు, మేనేజ్మెంట్ ట్రైనీలు, యువ పారిశ్రామికవేత్తలు ప్రస్తుత అదనాతన సాంకేతికతను ఆకలింపు చేసుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన సెషన్‌లో 'ఫైనాన్షియల్ అనలిటిక్స్ ఇన్ బిజినెస్ సక్సెస్' అనే అంశం పై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. 'రోల్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ అనలిటిక్స్ ఇన్ బిజినెస్ సక్సెస్' అనే అంశంపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి. మురుగన్ ఉపన్యసించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ సమకాలీన అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నందుకు ప్రశంసించారు. భవిష్యత్తులో ఇదే రకమైన వర్క్‌షాప్‌లను కొనసాగించాలని సూచించారు. కామర్స్, లా అండ్ మేనేజ్మెంట్ స్కూల్ ప్రొఫెసర్ వై. సుబ్బరాయుడు మాట్లాడుతూ డేటాను త్వరగా, మరింత కచ్చితంగా సేకరించడం, విశ్లేషించడం, వివరించడంలో సాంకేతికత పాత్రను నొక్కి చెప్పారు.

త్వరలో సంక్షేమ హాస్టళ్ల సందర్శన

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన వసతుల పై త్వరలో జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్ సందర్శన చేస్తున్నట్లు టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేష్ తెలిపారు. శుక్రవారం నగరంలోని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వం సంక్షేమ విద్యార్థులకు మెరుగైన వసతులకు పెద్ద పీట వేసిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతినిత్యం విద్యాశాఖ పైన ప్రత్యేక శ్రద్ధవహిస్తూ ఎప్పటికప్పుడు విద్యా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చేతన్ కుమార్ రెడ్డి, అధికార ప్రతినిధి సిద్ధార్థ రాయల్, కార్యదర్శులు అక్షయ్ కుమార్ రెడ్డి, రమేష్, జమ్మలమడుగు అధ్యక్షుడు మహేష్, వైవీయూ ఇంచార్జ్ అమృత్, అధ్యక్షుడు భరత్ సింహా, నాయకులు అబ్దుల్, హరి, సాదిక్, సాయి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను రోడ్లపై వేయరాదు : జడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి - చాపాడు

గృహాలలోని తడి, పొడి చెత్తలను రోడ్లపై వేయకుండా క్లాప్ మిత్రలు ఇంటి వద్దకు వచ్చినప్పుడు వారికి అందివ్వాలని జడ్‌పి సిఇఒ ఓబులమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని విశ్వనాథపురంలో అధికారులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పారిశుధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, షెడ్డు, తడి చెత్త,పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. చెత్త నుండి సంపద కేంద్రాల నిర్వహణ మరింత మెరుగుపరచాలన్నారు. వర్మీ కంపోస్టు తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రామాంజనేయులు, డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్ పంచాయతీ కార్యదర్శి సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సూచనలిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

పురాతన ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయానికి రాబోవు 50 ఏళ్లకు సరిపడేలా పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఇఒ ఛాంబర్‌లో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాల నాటికి భక్తులు రోజుకు ఎంత మంది రావచ్చు, ఆలయ పరిసరాలు ఎలా ఉండాలి, భక్తులకు సరిపడేలా మౌళిక సదుపాయాలు, వసతి, రవాణా, చారిత్రక నేపథ్యం ఉట్టిపడేలా, ఆధ్యాత్మికత, మరింతగా యాత్రికులు వచ్చేలా ముందస్తు ప్రణాళికలతో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట, పుష్కరిణి, నక్షత్ర వనాలు, గార్డెనింగ్, పచ్చదనం, ఆధ్యాత్మిక చిహ్నాలు, శ్రీ కోదండరామ స్వామి ప్రాశస్త్యం నవతరానికి అందించేలా మ్యూజియం, ఉద్యానవనాలు, సాంకేతికతను జోడించి డిజిటల్ స్క్రీన్స్, హనుమంతుడి సేవా నిరతి, సాంస్కృతిక కళామందిరం, లైటింగ్, తోరణాలు, చెరువులో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం, నాలుగు మాడ వీధుల అభివృద్ధి, సిసి కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలని సూచించారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో టిటిడి విజిలెన్స్, అటవీశాఖ, అన్నదానం, గార్డెనింగ్, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారులను భాగస్వామ్యం చేసి ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాలని ఇంజినీరింగ్ ఆదేశించారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ డాక్టర్ అనిల్ కుమార్ మాస్టర్ ప్లాన్ కు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో టిటిడి సిఇ టి.వి.సత్యనారాయణ, ఎస్ఇ-1, మనోహరం, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్

విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న మండల విద్యాశాఖాధికారులు

ప్రత్యేక అవసరాలు గల
విద్యార్థులకు అవకాశాలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరులోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఐఇఆర్‌టిలు రత్నప్రసాద్, ఆదిలక్ష్మి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖాధికారులు పద్మాలత, నరహరి శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులందరికీ భవిత స్కూల్ ద్వారా సహిత విద్యను అందిస్తున్నామన్నారు. వారికి ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, స్టయిఫండ్, స్కాలర్‌షిప్ లాంటి ప్రభుత్వ ప్రోత్సహకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి వారమూ ఫిజియోథెరపీ సహాయ ఉపకారణాలైన వీల్ చైర్లు, శ్రవణ యంత్రాలు, సైకిల్స్ తదితర పరికరాలు అందించడంలో సేవలందిస్తున్న రిసోర్స్ టీచర్లను అభినందించారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపిఎస్ సాయినాధపురం హెచ్ఎం సుబ్బారావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమమే కార్పొరేషన్ లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా కార్పొరేషన్ పని తీరు ఉండాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు ప్రసాద్ రావు, రఘునాథ్ రావు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. బ్రాహ్మణులను ఆర్థికంగా ముందుకు తీసుకుపోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. 2014 వరకు బ్రాహ్మణులను ఆర్థికంగా ముందుకు తీసుకుపోవడానికి ఏ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. 2014 నుండి 2019 మార్చి వరకు 1, 65000 లక్షల కుటుంబాలు రూ 265 కోట్లు కార్పొరేషన్ ద్వారా లబ్ది పొందాయని పేర్కొన్నారు. 2019 నుండి నేటివరకు కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు లబ్ది జరగ లేదని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి కార్పొరేషన్ పై ఆశలు ఏర్పడ్డాయని నేటికి పాలక మండలి పూర్తిగా వచ్చిందని ఇక బ్రాహ్మణ సంక్షేమమే లక్ష్యంగా పనిచేసి బ్రాహ్మణులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి చేస్తున్న సిఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని డిఎస్‌పి జి. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మేధా ఫిజెన్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆటో డ్రైవర్ లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. యూనిఫామ్ తప్పనిసరిగా ధరించి ఆటో నడపాలన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలన్నారు. డ్రైవర్ సీటు ప్రక్క ఆదనపు సీట్లు పెట్టుకొని ప్రయాణికులను ఎక్కించుకోరాదని చెప్పారు. మోటార్ వాహనాల చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి ఆటోలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైదుకూరు అర్బన్ సిఐ కె.రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి ఇంధన పరిరక్షణపై పోటీలు

- ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప

ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంధన పరిరక్షణ –ఆవశ్యకతపై వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వతరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మాత్రమే పాల్గొనేందుకు అర్హులన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 న ఇంధన పరిరక్షణ అంశంపై వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎన్నెర్జీ, ప్రజలు, కరపత్రాల పంపిణీ, 14, 15వ తేదీల్లో తిరుపతిలో సైన్స్ ఎగ్జిబిషన్‌లో స్టాల్ ఏర్పాటు, 15న పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, వినియోగదారులు, విద్యుత్ సంస్థ అధికారులు/సిబ్బందితో ర్యాలీ, 16న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 9, 10వతరగతుల విద్యార్థులకు ఇంధన పరిరక్షణ – ఆవశ్యకత అంశంపై క్విజ్, వక్తృత్వ పోటీలుంటాయన్నారు. 17న ఆధునిక సాంకేతికతతో స్మార్ట్ వీధిదీపాల నిర్వహణ, నీటి సరఫరా వ్యవస్థ అంశాలపై అవగాహన కల్పించేందుకు కళాశాల విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహణ, 18న స్వయం సహాయ బృందాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులకు, మహిళలకు వెబినార్ ద్వారా స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలు, వాటి ఉపయోగాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19 న గ్రామీణ వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు, ఆక్వా రైతులకు ఇంధన పరిరక్షణ, విద్యుత్, నీరు, ఇతర వనరుల సమర్థవంత వినియోగం, వ్యవసాయ పంపుసెట్ల నిర్వహణ అంశాలపై కళాజాతాలు, రైతు సంఘాలు, జన విజ్ఞాన వేదిక సహకారంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 16న తిరుపతి నుంచి ఆన్‌లైన్ ద్వారా ఫైనల్ రౌండ్ పోటీలను నిర్వహిస్తామని, విజేతలకు ఈనెల 20న న బహుమతులు ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈనెల 10లోగా వాట్సాప్ నంబరు 87124 80430 ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గండి ఉద్యోగికి ఉద్యోన్నోన్నతి

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి క్షేత్రంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న సుభాష్‌కు ఇఒగా ఉద్యోగోన్నతి లభించింది. శుక్రవారం ఆయన్ను వెంకటసుబ్బయ్య, అర్చకులు కేసరి స్వామి, రాజాస్వాములు, శాలవా పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. వీరాంజనేయ స్వామి దేవస్థానం నుంచి కడపకు ఫస్ట్ గ్రేడ్ ఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, లక్ష్మయ్య, భారతి గండి దేవస్థానం మాజీ చైర్మన్ కల్లూరు వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సుభాష్‌ను సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

విద్యార్థులు మంచి నడవడికతో మెలగాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

విద్యార్థులు మంచి నడవడికతో మెలగాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారుప. మైదుకూరు మండలం వనిపెంట గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్ 3.0లో ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరయ్యారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలలకు పంపిన తర్వాత తమకు సంబంధం లేని విధంగా వ్యవహరించకూడదన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్తూ విద్యార్థుల నడవడికను ఉపాధ్యాయులతో ఆరా తీయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిఇఒ శంషుద్దీన్, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, బద్వేలు ఆర్‌డిఒ చంద్ర మోహన్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఎంపిపి థామస్, విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు, ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చాపాడు:** మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల కమిటీ చైర్మన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంఇఒ రవిశంకర్, వంశీకృష్ణ, అయ్యవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సిద్దారెడ్డిపల్లెలో పాఠశాల కమిటీ చైర్మన్ ఐశ్వర్య, ఉపాధ్యాయులు శ్రీదేవి, మహాలక్ష్మి, నాయకులు హజరత్ రెడ్డి, సుబ్బిరెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కడప అర్బన్ :** సాయిపేటలోని 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన జాదూయీ పిటారా, స్పోర్ట్స్ మెటీరియల్, టిఫిన్ లెర్నింగ్ మెటీరియల్ ఎగ్జిబిషన్‌ను తల్లిదండ్రులు తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఎస్ఎంసి చైర్ పర్సన్ రాధిక, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి మెంబర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి పౌరులు : ఎమ్మెల్సీ

మీరంతా దేశం గర్వపడేలా తయారు కావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పని చేస్తున్న అధికారులు, డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు, నాయకులు ఎక్కువ భాగం ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారే అని గుర్తు చేశారు. ఇది మన అందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. నాడు నేడు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మార్చిందని తెలిపారు. 90శాతం పనులు పూర్తయ్యాయని, 10 శాతం పనులు పూర్తి చేసి విద్యార్థులకు భవనాలను అందుబాటులోనికి తీసుకురావాలని చెప్పారు. శుక్రవారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్ లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

కాశినాయన : పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాశి నాయన మండలం నరసాపురం లో జరిగిన మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం నరసాపురంలోని ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్‌లోనూ ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సౌజన్య, టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, పోలిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వేంపల్లె :** విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాల బడి పిలుపు – వికసిత్ ఆంధ్రకు మలుపు కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ రవి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేసిన క్రీడల్లో, విద్యల్లో రాణించిన విద్యార్థు లకు సర్టిఫికెట్లు, మెమెంటోలను రామమునిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల టిడిపి పట్టణ అధ్యక్షులు, నామా వేమకుమార్, ఎంపిటిసి రహంతుల్లా ఖాన్, మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, వైసిపి నాయకులు మటన్ బాషా, కళాశాల కమిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్ బాష, మహమ్మద్, గౌస్ బాబా, సుబహాన్, డక్కా రమేష్, ఇన్సియాజ్, కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డిలతో పాటు అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాలలు పునాదులు వేస్తాయని ప్రధానోపా ధ్యాయులు వెంకట్ నాయుడు, ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, అంగడి నాగేంద్ర, మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అచ్చవెల్లి గ్రామ లోని జడ్‌పి హెచ్ఎస్ ఎంపిపి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అచ్చవెల్లి గ్రామ సర్పంచ్ రమణ, ఎస్ఎంసి చైర్మన్ షరీఫ్, మండల, పంచాయతీ సెక్రటరీ జ్యోతి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూర్యుడు నాయక్, శ్రీనివాసులు, బాలయ్య, నాగరాజు నాయక్, విజయలక్ష్మి, జార్జ్ విద్యార్థులు, పాల్గొన్నారు. **ముద్దనూరు :** కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నాణ్యమైన విద్య అందిస్తుందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. రాజులగురువాయపల్లె గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ ,తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి భూపేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ముద్దనూరులో ఎంపిటిసి లక్ష్మీ కాంతమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుల చింతా శివరామిరెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి, కూటమి నాయకులు చంద్ర శేఖర్ నాయుడు, చంద్ర ఓబులరెడ్డి, కేశవరెడ్డి, జగదీశ్ కుమార్ రెడ్డి, శంకర రెడ్డి, ప్రత్యేక అధికారి వెంకట కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో సైతం విద్య బోధన అందిస్తున్నారని మాజీ జడ్‌పిటిసి సభ్యులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ భాగ్యలక్ష్మి, ఎంపిడిఒ శ్రీనివాసుల రెడ్డి, ఎంఇఒలు ఖాదర్‌బాషా, శారద, హెచ్ఎం సతీష్ ప్రభు కుమార్ పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** క్రమశిక్షణతో విద్యార్థులు బాగా చదువుకోవాలని మెప్మా పీడీ కిరణ్ కుమార్ విద్యార్థులకు తెలిపారు. పట్టణంలో ముద్దనూరు రోడ్డులోని జడ్‌పిహెచ్ పాఠశాలలో మెగా పేరెంట్స్ –టీచర్స్ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను తెలుసుకుని వారిని ప్రోత్సహించారు. మాక్ అసెంబ్లీ ఎన్నికై, తన గలన్ని మాక్ అసెంబ్లీలో వినిపించిన విద్యార్థిని సంగీతను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం రామాంజనేయులు రెడ్డి, ఐసిడిఎస్ ఎపిఎం గురు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు, చాంద్ బాషా, రామాంజనేయరెడ్డి, సునీత, గోవింద్, రమణ, చంద్రఓబుల రెడ్డి, జనార్దన్ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **చక్రాయపేట:** చదువుతోపాటు ఆటల్లోనూ పిల్లలను ప్రోత్సహించాలని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్తా తల్లిదండ్రులకు సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ సురేంద్రబాబు, చక్రాయపేట జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ షేక్ రంతు బాషా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎపిఎస్ డబ్ల్యూఆర్ఇఐఎస్ సమన్వకర్త ఉదయశ్రీ, ఎంపిడిఒ కె. శివారెడ్డి, తహశీల్దార్ పి.విజయ కుమారి, ఎంఇఒలు వెంకటసుబ్బయ్య, రవికిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చంద్రశేఖర్, కళ్యాణ చక్రవర్తి, కోటేశ్వర, పిఇటిలు సురేష్ బాబు, రవి, విద్యా కమిటీ చైర్మన్ రామయ్య, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సిడిపిఒ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఇఒ–2 రవి కిరణ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **గోపవరం :** మండలంలోని పూసలవాడ హైస్కూల్‌లో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ త్రిభువన్‌రెడ్డి హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **వేముల :** విద్యారంగ అభివృద్ధిని ముఖ్య లక్ష్యంగా తీసుకుని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టిడిపి మండల సీనియర్ నాయకులు శేషారెడ్డి అన్నారు. శుక్రవారం వేముల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దక్షిణామూర్తి, అధ్యాపకులు సునీత, మస్తానయ్య, సుబ్బరాయుడు, బాలయ్య, భాస్కర, అంజాద్ అలీ,జ గన్, సతీష్ రెడ్డి, కిరణ్మయి, పుల్లయ్య, బాబీ, భోదనేతర సిబ్బంది తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఒంటిమిట్ట :** మండల పరిధిలోని తన పెన్నపేరూరు పాఠశాలలో స్కూల్ హెడ్మాస్టర్ నరసయ్య ఆధ్వర్యంలో పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మంచి అలవాట్లు చేసుకోవాలన్నారు.

ఒంటిమిట్ట : మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు నరసయ్య

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బద్వేలు

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి జి. శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం సిఐటియు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సిఐటియు ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రభుత్వ, ప్రయివేట్, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికుల శ్రేయస్సుకై ఆహర్నిశలు రాజీలేని, సమరశీల పోరాటాలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. సిఐటియు పోరాటాల ఫలితంగానే కార్మికుల హక్కులు కాపాడుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. విశాఖలో ఈనెల 31 నుండి 2026 జనవరి 4 వరకు మహాసభలు నిర్వహిస్తామని చెప్పారు. కార్మిక ప్రదర్శన బహిరంగ సభలో అన్ని రంగాల కార్మికులు వేలాది సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మహాసభల నిర్వహణకు పట్టణ ప్రజలు,మేధావులు, వ్యాపారస్తులు, కార్మిక వర్గ పోరాటాలను బలపరిచే వారందరూ హార్థిక ఆర్థిక సహకారాలు అందించి సహకరించగలరని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు పి. చాంద్ బాషా, డి. హరి,కె.శివకుమార్, ఇ. రమణయ్య, జిల్లా కమిటీ సభ్యులు పి.శ్యామ్ ప్రవీణ్,ఇ. ఓబులేసు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు యస్. సత్యరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, పట్టణ కార్యదర్శి షేక్ ఆదిల్ భాష, ఐద్వా నాయకురాళ్లు

బద్వేల్ : మాట్లాడుతున్న జి.శివకుమార్

మౌక్షమ్మ,అనంతమ్మ, వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు సి. సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** 18వ సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. భైరవప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మహాసభలకు సంబంధించిన స్థానిక కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అఖిలభారత మహాసభలకు ఆర్థిక, హార్థిక విరాళాలు ఇచ్చి విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజు, రత్నం ,రవి, నారాయణ మాల్యాద్రి శ్రీను మేటి సంఘం నాయకులు గోసియాబేగం నాయకులు రంతన్ని, ఓబులమ్మ, లక్ష్మమ్మ, వసంత, వెంకటమ్మ వెంకటసుబ్బమ్మ , కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు చేపడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పురపాలక సంఘ పరిధిలోని అన్ని వార్డులలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి ఆక్రమణలు, మతపరమైన, ఆక్రమ కట్టడాలు చేయరాదని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో విగ్రహాలను అనుమతి లేకుండా రాత్రి సమయాలలో ఏర్పాటు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాలలో ఆక్రమించి కట్టడాలు చేపట్టడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై ఆంధ్రప్రదేశ్ మున్సిపలిటీ యాక్ట్ 1965 ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కట్టడాలను ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా తొలిగిస్తామని ఆయన తెలిపారు.

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- లింగాల

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకానికిసంబంధించి 2025 –26 రబీలో పొందేందుకు రైతులు ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్, ఇన్సూరెన్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇప్పట్ల రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు బీమా వివరాలను రైతులకు వివరించారు. రైతు వాటా ఎకరాకు వరి రూ. 630, రూ. జొన్న రూ.315 , వేరుశనగ రూ. 480, మినుములు రూ. 285, రూ. శనగ రూ. 270 , నువ్వులు రూ. 180 ప్రొద్దుతిరుగుడు రూ. 300 రైతులు వాటా చెల్లించాలన్నారు. డిసెంబర్ 15 నుండి 31 లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో రాజకీయ ప్రముఖులు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందుల చెన్నారెడ్డి కాలనీకి చెందిన ఎస్. త్యాగ రాజు దంపతుల కుమారుడు నితీష్ రాజు వివాహం, మానీ తెరిసా వివాహం పులివెందుల సిఎస్ఐ టౌన్ చర్చిలో ,రిసెప్షన్ శ్రీకర ఫంక్షన్ హాల్ లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు.

తులసిరెడ్డితో నూతన వధూవరులు

కార్యక్రమానికి పిసిసి అధికారప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమరనాథరెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ,చిన్నకొట్ల నాగరాజు , నామా విజయ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - చక్రాయపేట : గత నెల 29 నుండి ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ కోటేశ్వర మాట్లాడుతూ వారం రోజులుగా వివిధ గ్రామాల్లో పలు ప్రోగ్రాములు నిర్వహించామన్నారు. ఎపి సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ పరిధిలో నిర్వహించిన సేవా కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. సేవా కార్యక్రమాల్లో విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టుల్లో సహాయం, విద్యార్థుల ప్రోత్సాహక సెషన్లు, నది శుభ్రత, స్వచ్ఛ భారత్ కార్యక్రమం, వృక్షారోపణ, డ్రగ్ అవేర్‌నెస్ ఏర్పాటు, యోగా శిక్షణ, గుడ్ టచ్..బ్యాడ్ టచ్ అవగాహన, మహిళా భద్రత, బాల విద్య, సైబర్ సెక్యూరిటీ, రోడ్డు భద్రత, ఆరోగ్య పరిశుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారి ఉదయశ్రీ, యూనిట్ సేవలను సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్ అంబేద్కర్ గురుకుల ప్రిన్సిపల్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE IIIrd Addl. JUNIOR CIVIL JUDGE AT KADAPA

I.A.No. 779/2023
O.S.No. 1177/2023

Ponnolu Indraja. ...Petitioner/Plaintiff

Vs

Ponnolu Veera Reddy and Others. ...Respondent/Defendant

NOTICE TO RESPONDENT NO:2

Ponnolu Veeranjaneya Reddy, S/o P. Veera Reddy, aged 34 years, Hindu, resident of D.No. 12/57 Peeda chowtapalli Village, Kadapa City and Mandal, YSR Kadapa District.

పై దావాలో Petitioner/Plaintiff ప్రతివాదులైన మీ పై దావా వేసియున్నారు. సదరు దావాలో నోటీసులు మీకు ముట్టకుండుట కోర్టు వారు పేపర్ నోటీస్ ద్వారా తెలియజేయ ఆదేశాలు ఇచ్చి యున్నారు. కావున మీరు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల 17.12.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపవలెను. లేని యెడల ఏ పరోక్షము నందు తీర్మానించబడును.

//By Order of the Court//

CHAVVA SIVA PRASAD REDDY
Advocate,
Kadapa.

నిరుపయోగం.. పాల సేకరణ భవనాలు

శిథిలావస్థలకు చేరుకున్నా.. పట్టని అధికారులు

సిద్దారెడ్డిపల్లె వద్ద నిరుపయోగంగా ఉన్న పాలకేంద్రం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్నాయి. 40 ఏళ్ల కిందట సిద్దారెడ్డిపల్లె, నాగులపల్లె, విశ్వనాథపురం, ఓబులరెడ్డిపేట, చిన్నగురువలూరు, అనంతపురం, అన్నవరం, గ్రామాల్లో సహకార సంఘాలు ఏర్పాటు చేసి దాతల నుండి స్థలాలను సేకరించి పాలసేకరణ కేంద్రాల్లో నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన పాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రొద్దుటూరు మైదుకూరు తరలించేవారు. కాలక్రమేణా ప్రభుత్వ కేంద్రాలు మూతపడటంతో ప్రయివేట్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ పాల సేకరణ కేంద్రాలు మరుగున పడ్డాయి. ఫలితంగా భవనాలు చాలావరకు దెబ్బతిన్నాయి. సిద్దారెడ్డిపల్లె గ్రామంలో ఏడేళ్ల కిందట పాలసేకరణ భవనానికి మరమ్మతులు చేపట్టి మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అది రెండు సంవత్సరాలు కొనసాగిన తర్వాత మూతపడింది. ఓబులరెడ్డిపేటలో భవనం ఇప్పటికీ ప్రయివేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో పాల సేకరణ కొనసాగుతోంది. మిగిలిన గ్రామాల్లో మాత్రం చాలా అధ్వాన్నంగా మరుగున పడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలు కోసం వీటికి మరమ్మతులు చేసి వినియోగించుకునే అవకాశం ఉంది. విశ్వనాథపురంలో రోడ్డు విస్తరణలో కొంతభాగం భవనం తొలగించారు. పూర్తిగా దెబ్బతిన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం అమూల్ పాల కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం పాల సేకరణ ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టలేదు. శిథిల వ్యవస్థకు చేరుకున్న భవనాలను తొలగించి అస్థానంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

శోభాయమానంగా అయ్యప్ప స్వామి అంబలం పూజ

ప్రజాశక్తి - కడప అర్బన్

కె ఎస్ ఆర్ ఎం కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో అయ్యప్ప స్వామి అంబలం పూజ మార్గశిర పూర్ణిమ రోజు పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమానికి కందుల విద్యా సంస్థల అధినేత, వైస్ చైర్మన్ డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 1500 మంది మాల వేసిన వారు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. హాజరైన వారందరికి అన్నదానం ఏర్పాటు చేశారు. పూజ అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇంటికి వెళ్లడానికి బస్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హరి నారాయణ, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, చైర్మన్ మదన మోహన్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.ఎన్. ప్రసాద్, కాలేజ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతిని వెలిగిస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి